ఆమెలో సహనం సాంతం చచ్చింది. "నువ్వే నా అమృతభాండారంలో విషం చిలకావు. క్షణ క్షణం అపశకునం అంటూ నన్ను కుక్కకన్నా హీనంగా చూశావు. నా తప్పేమీలేదు. అంతా నీ స్వయంకృతం అని నేను నొక్కిచెప్తున్నాను. ఇంకా ఎన్నాళ్ళు సహించమంటావు? జ్వరంతో నా ఒళ్ళు కాలిపోతోంది. నోట్లోంచి రక్తం కూడా పడుతోంది. జీవితపు అంతమఘడియల్లో నువ్వు నన్నేం చెయ్యదల్చుకున్నావో చెప్పు..." "ఆపు" అన్నాడు సుభాష్. కాని ప్రక్కన భయంకర దృశ్యం చూసి అతని కంఠం పెగల్లేదు. పేగులు కదిలేలా శాంత దగ్గుతుంది. నోట్లోంచి రక్తంపడుతోంది. నేలమీది కొరిగిపోయిందామె. భయంతో ఆమెకేసి చూశాడుసుభాష్ 'ఒంట్లో బాగాలేదా?' అని అడిగాడు. కాని సమాధానం వినిపించలేదు.

స్మశానంలో శాంత శవం కాలుతోంది. సుభాష్ ఓ నిట్టూర్పు విడిచాడు. మూడవరోజునుంచీ మళ్ళీ పెళ్ళికి పిల్లని వెదకడం ప్రారంభించాడు. విశేష మేమంటే ఈసారి మంచి ముహూర్తం, శుభప్రద మైన శకునం చూసుకుని పెళ్ళిచేసుకుంటాడుట.

కథానిక

# పెళ్ళికాని ఆడపిల్ల

వేదుల కామేశ్వరరావు

సుందరమ్మను పెళ్ళివారొచ్చారు. ఇదివరకు వస్తూన్నట్లుగానే ఇప్పుడూ వచ్చారు. పార్వతమ్మగారి ఆనందానికి మేరలేదు. ఆవిడ కళ్ళ నుంచి ఆనంద బాష్పాలు రాలాయి. అందులో కొత్తేమీలేదు. ఇదివరకులానే ఇప్పుడూ రాలాయి. గబగబా కుంపటి అంటించి కాఫీ చేసింది. రామాన్ని పంపించి మిఠాయి తెప్పించింది. శంకరయ్యగారికి కాలు భూమిమీద నిలవటమే లేదు. అందులోనూ అట్టే కొత్తలేదు. ఇదివరకు వలెనే ఇప్పుడూ ఆయన అన్ని విషయాలూ చక్కబెట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు. వచ్చిన పెళ్ళి వారిని చిరునవ్వుతో ఆహ్వానించాడు. కుర్చీలు చూపించి కూర్చోమని చెప్పి, పిల్లకోసం లోపల కెళ్ళాడు. సుందరమ్మ ఇదివరకులానే ముస్తాబవుతోంది. ఉన్న బట్టలే కడుతోంది. లేని నగలకోసం బాధపడకుండా ఉన్నవన్నీ అలంకరించుకుంటోంది. "రా! సుందరం! తొందరగా రావాలి" శంకరయ్యగారు కూతురును హెచ్చరించారు. ఇది వరకూ అలానే హెచ్చరించారు. కాని, ఈసారి ఇది వరకుకన్న ఎక్కువ ఆందోళనతోనూ, బాధతోనూ హెచ్చరించారు. భయపడుతూనే వచ్చింది సుందరమ్మ, అలవాటు ప్రకారంగానే పల్లకీలో పెళ్ళికూతురు కూర్చొన్నట్లు తలవంచి కూర్చొంది చాపమీద.

పెళ్ళికొడుకు దృష్టిని ఆమెవైపు సారించాడు. అతడు నవల్సులో చదివినట్లు ఆమె వాలు జడల సూది మొనలు సర్పరాజాల్లా బుసలు కొట్టడం లేదు. ఒక్క జడే మామూలుగా వేసుకొంది. ఆమె ఎడమ చేతికి చిన్న రిస్టువాచీ లేదు; కుడి చేతిలో తోలుసంచీ (హేండ్ బేగ్) లేదు. కాని రెండు చేతులకూ దట్టంగా కొట్టొచ్చేటట్టు రంగు గాజులున్నాయి. ఆమె చూపులు వాడిగా, సూదుల్లా అతని హృదయంలో గ్రుచ్చుకోవడం మానేసి, మధ్యలోనే మొనలు విరిగిపోయి బండ బారి పోతున్నాయి. జారే జారే సిల్కుపమిట కనబడటం లేదుగాని, కాశ్మీరెళ్ళినా చలివెయ్యని దట్టమైన నేతచీర కట్టుకొంది. కాళ్ళకు స్లిప్పర్స్ లేవుగాని, పసుపు దట్టంగా పూసింది. మెడలో నెక్‌లెస్ లేదుగాని, ఒంటిపేట బంతి పువ్వుల చంద్రహారం పాత ఫక్కీలోనే వ్రేలాడుతోంది. ఆమె ముఖానికి పౌడరుకు బదులుగా ఎఱ్ఱటి బొట్టువుంది. వయ్యారంగా, విలాసంగా, సోషల్‌గా వుండటం మానేసి, తలొంచుకొని సిగ్గుగా కూర్చొంది. నాన్‌సెన్స్! సెప్టెంబర్‌లో కంప్లీట్ చేసినా, బి. ఏ., ప్యాసయిన తనకు, అందులోనూ టౌన్‌లో నలుగురితోనూ తిరిగే తన గౌరవ మర్యాదలకు భంగం కల్పించే ఈ "పల్లెటూరిపిల్ల" తనకు అర్థాంగి కావటమా?

పెళ్ళికొడుకింక ఆమె వైపే చూడలేదు. తను చదివిన నవల్స్‌లో కనబడిన పిల్లలు తనకు పెళ్ళి చూపుల్లో మాత్రం ఎందుకు కనబడకూడదు? ఎంతో అనుభవం కొద్దీ వ్రాసిన నవలారచయితలే లేకపోతే తనకసలు అందం అంటే ఏమిటో తెలియక పోను. అయినా, బి. ఏ., ప్యాసయినవాడిని నిండుగా తీసుకొచ్చి కుర్చీలో కూర్చోబెట్టి, ఈ పల్లెటూరి విగ్రహాన్ని ముందు కూర్చోబెడతారా? రేపు పట్నంలో తనూ—ఆమె రిక్షాలో ఎక్కడకైనా వెడుతుంటే స్నేహితులు చిన్నచూపు చూడరూ? పెళ్ళికొడుకు కోపానికి అంతులేదు.

పెళ్ళికొడుకు చిరునవ్వు మానేసి ఆరిపోతున్న ఎలక్ట్రిక్ బల్బులా ముఖంలో వర్చస్సు తగ్గించేసి, కోపం తెచ్చుకోవటం చూసి, శంకరయ్యగారు గతుక్కుమన్నారు. స్కూల్ మాష్టరీచేసి ఏదో సంపాదిస్తున్నాడు. సంపాదించినదాంట్లో మిగలటం లేదుగాని, ఒకటో తారీఖునాటికి అప్పులు బాగా పెరుగుతున్నాయి. ఈ సుందరమ్మకు పెళ్ళయిందనిపిస్తే ఇప్పుడు కొంత గొడవొదుల్తుంది. తరువాతమ్మాయికి నాలుగేళ్ళవరకూ తొందరలేదు. శంకరయ్య గారీ పెళ్ళికోసం తన శక్తులన్నీ ధారపోస్తున్నాడు. తీరా చూస్తే పెళ్ళికొడుకు కోపంగా చూస్తున్నాడు. ముఖం చిట్లిస్తున్నాడు. నవల్స్‌లో నాయిక కుండవలసిన లక్షణాలను గురించి బాధపడ్డ అతనికి, ఆ నవల్స్‌లోనే నాయకున కుండవలసిన ఓర్పు, దయ, దాక్షిణ్యం, శౌర్యం, త్యాగం మొదలైనవేమీ లేవు. అయినాసరే పెళ్ళికూతురు పుస్తకాల్లో నాయిక మోస్తరుగానో, కాలేజీలో చదువుకొనే అమ్మాయిగానో వుండాలి.

పెళ్ళికొడుకుతోబాటు అతని తండ్రీ ఒక అవధాన్లుగారూ వచ్చారు. “కళగా చక్కగావుంది. లక్ష్మీదేవిలా కనబడుతోంది” అన్నాడు అవధాన్లు బొడుం పీలుస్తూ, పెళ్ళికొడుకు ప్రక్కకు తిప్పుకొన్న ముఖం వైపు చూడకుండానే “ఏమైనా చదువుకొన్నావామ్మా?” అని ఆమెను ప్రశ్నించాడు పెళ్ళికొడుకు తండ్రి. “ఆఁ. ఏదో థర్డుఫారం చదివింది లెండి. మనిళ్ళలో ఆడవాళ్ళకి వయసొచ్చే వరకేగాని, తరువాత చదువెందుకు లెండి? ఏదో ఇంట్లో పద్దులూ గట్రా వేసుకొందుకు చాలినంత చదువుంటే చాలు ననుకొని థర్డుఫారంతోనే ఆపేశానండి” అంటూ శంకరయ్యగారు పాతచెప్పిడి—ముక్కులే ఏ కరు పెట్టడం పెళ్ళికొడుక్కి బాధగానే వుంది. “సంగీతమేదైనా వొచ్చునా?” అని రెండవ ప్రశ్న సూటిగా పెళ్ళికొడుకు నుంచే వచ్చింది. అతని వుద్దేశ్యం ఆమెకు సంగీతం రాదంటారు గదా! ఆ ప్రశ్నకు మార్కులివ్వకుండానే (తనకు బి. ఏ. లో మొదటిసారి చేసినట్టు) ఆమెను ఫేల్ చెయ్యొచ్చును కొన్నాడు. కాని, శంకరంగారు వెంటనే వెళ్ళి హార్మోనియం పెట్టీ అవీ తీసుకొచ్చి ఆమె ముందుంచారు. ఏదో సినిమాసాంగ్ న్యూస్టయిల్ లో వినబడుతుందనుకొని అనవసరంగా, పొరపాటున చిరునవ్వు తెచ్చుకొన్న పెళ్ళికొడుకు కర్ణపుటాలమీద త్యాగరాజు గారి పాతకృతి ఖంగ్‌మంటూ మ్రోగగానే అతడి ముఖంలోని చిరునవ్వు ఒక్కసారి పారిపోయింది. రుసరుసలాడుతూ ముఖం ప్రక్కకు పెట్టేశాడు. అతని వాలకం చూసి శంకరయ్యగారుమళ్ళీ గతుక్కుమన్నాడు.

“నాన్నా! అమ్మ పిలుస్తోంది” అంటూ పెళ్ళికూతురు (?) తమ్ముడు రామం పరుగెత్తుకు వచ్చాడు. శంకరయ్యగారు లోపలకెళ్ళి “ఏం కావాలి?” అని ప్రశ్నించాడు. “పాపం వాళ్ళొచ్చి చాలాసేపయింది. మిఠాయి తెప్పించాను. కాఫీ కాచాను. కాస్త ఇవి తీసుకెళ్ళి వాళ్ళకివ్వండి” అంది పార్వతమ్మగారు సంతోషంగా. “ఏడిసినట్టే వుంది! ఇదివరకు వచ్చినవాళ్ళందరికీ ఇలా కాఫీలూ అవీ ఇవ్వటంవల్లే ఏ సంబంధమూ ఖాయపడలేదు. ‘కలికితే అతకదు’ అన్న శాస్త్రాన్ని బట్టి మనం ఈసారి వాళ్ళకేమీ ఇవ్వకుండా వుంటే పెళ్ళవుతుందేమోనని ఆశగా వుంది నాకు. ఇప్పుడు తప్పితే ఇకమనం సంబంధాలకోసం తిరగలేం” అంటూ ఆయన సావిట్లో వచ్చేశాడు. పెళ్ళివారు కుర్చీలోంచి లేచారు. పెళ్ళికొడుకు ఆఖరుసారిగా సుందరమ్మను చూశాడు. అవధాన్లుగారూ, పెళ్ళికొడుకుతండ్రీ, “వెళతామండి. వెళ్ళగానే ఏమాటా ఉత్తరం వ్రాస్తాం” శంకరయ్యగారికి చెప్పి వెళ్ళిపోయారు. బండి మలుపు తిరిగే వరకూ రెప్ప వాల్చకుండా చూసి ఆయన లోపలకొచ్చాడు. సుందరమ్మ హార్మోనియంపెట్టె పుచ్చుకొని గదిలో కెళ్ళిపోయింది. పెళ్ళికొడుకు స్థితిగతుల్నీ, మామ

గారి మంచితనాన్ని, సుందరమ్మకు ముందున్న అదృష్టాన్నిగురించి ఆ రోజంతా శంకరయ్యగారు పార్వతమ్మగారితో ముచ్చటిస్తూనే వున్నాడు.

ఆనాటితో బాటు ఒకటి రెండు వారాలు గడిచాయి. పెళ్ళివారిదగ్గర్నుంచి ఏవిధమైన ఉత్తరమూ రాలేదు. శంకరయ్యగారికేమీ తోచటం లేదు. ఈ పెళ్ళి స్థిరపడుతుందని ఆయనెంతో ఆశించాడు. ఎలాగోలా తంటాలుపడి నాలుగు వేలవరకూ కట్నం ఇవ్వడానికి నిర్ణయించుకొన్నాడు. అయినా వాళ్ళదగ్గర్నుంచి ఉత్తరంలేదు. పిల్ల నచ్చలేదేమోనన్న అనుమానం ఆయన్ను పీడించింది. పార్వతమ్మగారాయన్ను ఒకసారి రాజమండ్రి వెళ్ళి కనుక్కురమ్మంది. రెండురోజులు సెలవుపెట్టి రాజమండ్రి వెళ్ళాడాయన.

పెళ్ళికొడుకు తండ్రి పడకకుర్చీలో కూర్చొన్నాడు. శంకరయ్యగార్ని చూసి, ముఖం త్రిప్పుకొని చూడనట్టు నటిస్తున్నాడు. పేపరు చదువుకొంటున్న పెళ్ళికొడుకు ఛటుక్కున లేచి లోపలకెళ్ళిపోయాడు. శంకరంగారికి కాళ్లు దడదడలాడాయి. శరీరమంతా చెమటలు పోసింది. ఏదో బాధ ఆయన్ను వేపించుకు తింటోంది. కంఠం సర్దుకొని, "బావగారూ! నాలుగురోజుల్లో ఉత్తరం వ్రాస్తామన్నారు. తమకు కనబడి వెడదామని వచ్చాను" అంటూ ఉపోద్ఘాతం ప్రారంభించాడాయన. ఆ ఉపోద్ఘాతంలోనే ఆయన్నాపేస్తూ "సరేవెళ్ళండి. ఇంకా ఏమీ నిర్ణయించుకోలేదు. నాలుగురోజుల్లో జాబువ్రాస్తాలెండి" అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి. శంకరంగారు అవధాన్లింటికి వెళ్ళి విషయాలన్నీ సవిస్తరంగా ఆయనకు చెప్పాడు. ఇంట్లో చిల్లరఖర్చుల నిమిత్తం నాలుగు రూపాయలుచ్చుకొని, "రెండురోజుల్లో అంతా తెలుసుకొని ఉత్తరం వ్రాస్తాలెండి. సాధ్యమైనంతవరకు ఓవెయ్యి అటో ఇటో చూసి ఈ పెళ్ళి జరిగేలా చూస్తాలెండి!" అంటూ ధైర్యంచెప్పి ఆయన్ను సాగనంపేశాడు.

పార్వతమ్మగారు ఉత్తరంకోసం రోజూ ఎదురు చూస్తోంది. సుందరమ్మ బెంగగా వుండి అన్నం సరిగా తినటంలేదు. శంకరయ్యగారు బడికి వేళకు వెళ్ళలేకపోతున్నాడు. ఆమెకు పెళ్ళిచెయ్యాలని వారి కుతూహలం. కాని ఎంత తిరిగినా, ఎన్ని గుమ్మాలెక్కిదిగినా, ఎంతమందిని కాళ్ళూచేతులూ పట్టుకొని బ్రతిమలాడినా, ఆమెకు పెళ్ళికావడం కష్టంగావుంది. ఆమె కళ్యాణరేఖ ఇంకా బయట పడలేదు కాబోలు ననుకొంటూ వారు కొంత దుఃఖాన్ని దిగమ్రింగుతున్నారు.

శంకరయ్యగారు బడికి వెళ్ళాడు. కుర్చీలో కూర్చొని పాఠంచెబుతున్నాడు. ఎదురుగుండా ఉన్నవాళ్ళంతా చిన్నచిన్న కుర్రాళ్లు. ఒక్కడూ లాగూ చొక్కా సరిగా తొడుక్కోలేదు. తల దువ్వుకోవటం ఎవరికీ చేతకాదు. వీళ్ళే రెండు మూడేళ్ళలో పెద్దవాళ్ళయి పెళ్ళికొడుకులుగా పరిణామం చెందుతారు. అప్పుడీ భూలోకంలో ఏ పిల్లా వారికి నచ్చదు. ఏవేవో ఆలోచిస్తున్నాడాయన. ఇంతలోనే మించిపోయినట్టు పోస్టుమేన్ ఉత్తరం ఇచ్చాడాయనకు. అరే! అది అవధాన్లు స్వంతంగా వ్రాశాడు. ఆత్రుతగా చదవటం మొదలుపెట్టాడు శంకరయ్యగారు. అంతా చదివేటప్పటికి ఆయన కళ్ళమ్మట రెండు నీటిబిందువులు గిర్రున తిరిగి ఉత్తరంమీద పడ్డాయి.

పెళ్ళికొడుకు కే మర్యాదలూ జరగలేదట. పిల్ల పల్లెటూరి ఫక్కీలో వుండి అనాగరికంగా వుందట. పెళ్ళికూతురు తండ్రికి మర్యాద తెలవదట. పైపెచ్చు ఆయని వారిని స్టేషన్‌వరకైనా సాగనంపలేదట. ఇంకా ఇలాటి చిల్లర విషయాలు చాలా వుంది, అన్నీ కలసి పెళ్ళికొడుక్కాగ్రహం కలిగించాయట. 'ఇంకొక సంబంధం చూసుకోండి' అంటూ అవధాన్లు సలహాతో ఉత్తరం పూర్తి అయింది. శంకరయ్యగారికి బుర్ర తిరిగిపోయింది. తను మర్యాద కేం లోటుచేశాడు? పిల్లలో అవకరం ఏముంది? ఆనాడా పెళ్ళికొడుకు తన తీక్షణ వీక్షణాలతో తన్ను హడిలించినప్పుడే అనుకొన్నాడాయన ఈ సంబంధం కుదరకపోవచ్చునని. సరిగా అలాగే అయింది. ఇంకొక పెళ్ళికొడు కెవరు ఉన్నాడు?...ఆలోచిస్తున్నాడు శంకరయ్యగారు "మాష్టారూ! ఈతిబాధ లేమిటండీ?" అని ఒక చిన్న విద్యార్థి తపీమని ఓ ప్రశ్నవేశాడు. ఆలోచనలో మునిగివున్న శంకరయ్యగారు, "అతివృష్టి, అనావృష్టి, పెళ్ళికాని ఆడపిల్లా..." అంటూ చెప్పుకుపోతున్నాడు. అర్థంకాని విద్యార్థులు గుడ్లు మిటకరిస్తున్నారు. ★